
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

జిల్లాల వార్తలు

సోమవారం 12 మే 2025

ఈ నెల 19 నుంచి ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్ మ్యాచ్‌లు

- 13 నుంచి జిల్లా జట్ల ఎంపికలు 7

నీటి సమస్య పరిష్కారానికి అమృత్ 2.0

- నర్సాపూర్‌లో రూ.12 కోట్లతో ట్యాంకులు 8

ఆధ్యాత్మిక శోభ

- ఏడుపాయల వనదుర్గామాత, కొమురవెల్లి మల్లన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పలుచోట్ల జాతరలు
- ఆకట్టుకున్న ఎడ్లబండ్ల ఊరేగింపు

6లో



అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌లో..



'ఖేడ్' మండలం తుర్కపల్లిలో భూలక్ష్మమ్మ ఆలయం జాతరలో బండ్ల ప్రదర్శన

మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన జగ్గారెడ్డి, నిర్మల

సంగారెడ్డి రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో వారు పలు అంశాలపై చర్చించారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులను మహేష్‌కుమార్‌గౌడ్‌కు జగ్గారెడ్డి పరిచయం చేశారు.



సంగారెడ్డిలోని ప్రభుత్వ అతిథి గృహంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో మాట్లాడుతున్న జగ్గారెడ్డి



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసిన నిర్మలాజగ్గారెడ్డి

పాలియేటివ్, జీరియాట్రిక్ కేర్ వార్డుల

ఆధునికీకరణ

రూ. 10 లక్షలు మంజూరు చేసిన సర్కారు



సంగారెడ్డి జీజీహెచ్‌లోని పాలియేటివ్ కేర్ సెంటర్

సంగారెడ్డి అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని రెండు వార్డుల ఆధునీకరణ, వైద్య పరికరాల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ రివాల్వింగ్ ఫండ్ కింద రూ.10 లక్షల నిధులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జీజీహెచ్‌లోని జీరియాట్రిక్ (వృద్ధుల) వార్డుతో పాటు పాలియేటివ్ కేర్ సెంటర్ (డిస్ట్రిక్ట్ క్యాన్సర్ కేర్) ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు. రూ.5 లక్షల నిధులు సివిల్ వర్క్స్, మిగతా రూ.5 లక్షల నిధులను 12 రకాల వైద్య పరికరాల కొనుగోలుకు వెచ్చించనున్నారు. టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో ఆయా వార్డుల్లో ఆధునీకరణ పనులు చేపట్టనున్నట్లు ఈఈ రవీందర్‌రెడ్డి తెలిపారు.

బాధితులకు మరిన్ని సౌకర్యాలు

జీజీహెచ్‌లోని ఎనిమిది పడకల పాలియేటివ్ కేర్ సెంటర్‌లో దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్, క్యాన్సర్, పక్షవాతంతో బాధపడుతూ చివరి దశలో ఉన్న బాధితులకు వ్యాధి ఉపశమనం, సంరక్షణ చర్యలు తీసుకుంటారు. బాధిత వ్యాధిగ్రస్థులకు నొప్పి, బాధ తెలియకుండా వార్డులో చివరి స్టేజ్ వరకు మందులు, ఫిజియోథెరపీ, ఇతర వైద్య సేవలందిస్తారు. దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమైన రోగులకు సాంత్వన చేకూర్చేలా వైద్య సేవలు అందిస్తారు. చనిపోయే వరకు నొప్పి, బాధ తెలియకుండా వైద్య సేవలందిచడమే పాలియేటివ్ హెల్త్‌కేర్ కార్యక్రమ ఉద్దేశం. మరో పది పడకల జీరియాట్రిక్ కేర్ వార్డులో వృద్ధులు, వయోవృద్ధులకు వైద్య సేవలందిస్తున్నారు. జీజీహెచ్‌లోని పాలియేటివ్ కేర్ సెంటర్, జీరియాట్రిక్ కేర్ సెంటర్ల ఆధునీకరణతో ఆయా కేంద్రాల్లోని చికిత్స పొందుతున్న బాధితులకు మరిన్ని వసతులు, సౌకర్యాలు సమకూరనున్నాయని జీజీహెచ్ సూపరింటెండెంట్ అనీల్‌కుమార్ తెలిపారు.

పెట్రోల్ బంకుల్లో సౌకర్యాలు కరువయ్యాయి. ఇంధన వినియోగదారుల నుంచి వసూలు చేసే డబ్బుల నుంచి కొంత బంకుల్లో సదుపాయాల కోసం వినియోగించాల్సి ఉంటుంది. కానీ, మెదక్ జిల్లాలో బంకుల నిర్వాహకులు అటువంటి నిబంధనలేవీ పాటించడం లేదు. ఇంధన సంస్థలు, అధికారులు పట్టించుకోకపోవడంతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి.

సౌకర్యాల ఊసేలేదు!



చేగుంటలోని పెట్రోల్‌బంకు

పెట్రోల్ బంకుల్లో సదుపాయాలు కరువు

- తాగునీరు దొరకవు.. టాయిలెట్లకు తాళాలు
- వాహనాల్లో గాలి నింపితే డబ్బులు ఇవ్వాల్సిందే
- పట్టించుకోని ఇంధన సంస్థలు, అధికారులు

మెదక్, మే 11 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో 90 పెట్రోల్ బంకులు ఉన్నాయి. నిత్యం ఒక్కోటీ 5 నుండి 8 వేల లీటర్ల వరకూ ఇంధనాన్ని విక్రయిస్తాయి. వినియోగదారులు చెల్లించే డబ్బులో కొంత బంకుల్లో సదుపాయాల కల్పనకు వినియోగించాలి. ప్రతీ బంకులో ప్రథమ చికిత్సపెట్టె అందుబాటులో ఉంచాలి. ఇందులోని పరికరాలు, మందులను ఎవరైనా వాడుకోవచ్చునని నిబంధనలు చెబుతున్నాయి. పెట్రోలు బంకుల్లో శుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉంచాలి. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా అన్ని బంకుల్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు ఉచితంగా వినియోగించుకోవచ్చు. అత్యసర సమయాల్లో ఎవరికైనా ఫోన్ కాల్ చేసేందుకు ఫోన్ సదుపాయం ఉండాలి. ఇంధనం నాణ్యత తెలుసుకునేందుకు సంబంధించిన పరికరాలను ఉచితంగా అందుబాటులో ఉంచాలి. వాహనాల టైర్లలో గాలి నింపే సర్వీసు పూర్తిగా ఉచితం. ఒకవేళ ఈ సౌకర్యాలు బంకులో లేనట్లయితే ఫిర్యాదు చేయాలని చమురు సంస్థలు ప్రకటించాయి. ఇండియన్ ఆయిల్ 18002333555, భారత్ పెట్రోలియం 180022 4344, హెచ్‌పీసీఎల్ 18002333555, రిలయన్స్ 18008919023 నంబర్లను సంప్రదించాల్సిందిగా సూచించాయి. కానీ జిల్లాలోని అనేక పెట్రోల్ బంకుల్లో ఈ సదుపాయాలు కానరావడంలేదు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలతో పాటు రహదారుల ఇరుపక్కలా పెట్రోలు బంకులు ఉన్నా సదుపాయాలను మాత్రం అందివ్వడం లేదు.

- చేగుంట బస్టాండ్ పక్కన ఆర్టీసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పెట్రోలు బంకులో గాలి నింపే యంత్రాలు ఏర్పాటు చేయలేదు. మండల కేంద్రంలో పలు కంపెనీలకు చెందిన బంకుల్లో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ అవి నిరుపయోగంగానే ఉన్నాయి. రెడ్డిపల్లిలోని ఓ బంకులో మరుగుదొడ్డి తాళం వేసిఉంటుంది. బంకు ఏర్పాటు చేసే సమయంలో నిబంధనల ప్రకారం మరుగుదొడ్లు నిర్మిస్తారు. ఆ తర్వాత బంకులో పనిచేసే సిబ్బంది మాత్రమే ఉపయోగించుకునేందుకు తాళం వేసి ఉంచుతారని వినియోగదారులు వాపోతున్నారు. లేదా కనబడకండా ఎక్కడో దూరంగా టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నారు. పెట్రోలు బంకులో టాయిలెట్లు వెతుక్కునే పరిస్థితి ఉంటోంది.
- మనోహరాబాద్ మండల కేంద్రం గుండా ఉన్న జాతీయరహదారి సమీపంలో పెట్రోలు బంకుల్లో వాహనాలకు గాలి నింపే యంత్రాలు అందుబాటులో లేవని పరిశీలనలో వెల్లడైంది. జిల్లా వ్యాప్తంగా అనేక బంకుల్లో తాగునీటి సౌకర్యం లేదు. హైవేల పక్కన కొన్ని బంకుల్లో ఫ్రీజర్లు ఏర్పాటు చేసినా అందులో తాగునీరు ఉండదు. జిల్లా కేంద్రంలో ఏ కేంద్రంలోని పలు బంకుల్లో నిర్వాహకులు గతంలో ఏర్పాటు చేసిన గాలి యంత్రాలను కూడా తొలగించారు.



తాళం వేసి ఉన్న టాయిలెట్లు

స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తాం

బంకులకు ఇంధనం సరఫరా చేసే సంస్థల సేల్స్ ఆఫీసర్లు వినియోగదారులకు కల్పిస్తున్న సదుపాయాలను తనిఖీ చేయడంలేదు. వినియోగదారుడు చెల్లిస్తున్న ఇంధనం ధరలో కొంత బంకుల్లో సౌకర్యాల కోసం వినియోగించాలి. నిబంధనల ప్రకారం నిర్వాహకులు ఆ సేవలు అందించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లలో బిజీగా ఉన్నాం. త్వరలోనే జిల్లావ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బంకులను తనిఖీ చేస్తాం.

-సురేష్‌రెడ్డి, డీఎస్‌వో, మెదక్ జిల్లా



ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

- రిజర్వాయర్ల వద్ద తరచూ ప్రమాదాలు
- నీటిలో కలుస్తున్న ప్రాణాలు
- విషాదం నింపుతున్న విహార యాత్రలు
- జాగ్రత్త చర్యలు చేపట్టని అధికారులు
- పర్యాటక కేంద్రాల్లో వసతులు కరువు

7లో



తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడుతున్న దొంగలు
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

7లో

రైతు కుటుంబానికి ఏదీ ధీమా?

నెలలు గడుస్తున్నా అందని రైతు బీమా



ఆర్థిక ఇబ్బందుల్లో రైతు కుటుంబాలు

మనూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): రైతు కుటుంబాలకు అండగా నిలవాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతు బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. రైతులకు చెల్లించాల్సిన ప్రీమియం ప్రభుత్వమే బీమా కంపెనీకి చెల్లించి రూ.5 లక్షల బీమా కల్పిస్తుంది. ఈ పథకం ప్రవేశపెట్టిన తరువాత వేల కుటుంబాల రైతులకు అండగా నిలిచింది. మనూరు మండలంలో ఇటీవల మరణించిన రైతుల కుటుంబాలకు రైతు బీమా డబ్బులు అందక పోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో పడాల్సిన పరిస్థితి నెలకొంది. మనూరు మండలం డోవూరు గ్రామానికి చెందిన శంకర్‌గొండ అనే రైతు ఫిబ్రవరి నెలలో మరణించారు. అప్పట్లో రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, మూడు నెలలవుతున్నా బీమా డబ్బులు రాలేదని గ్రామస్థులు తెలిపారు. అతిమ్యాల్ గ్రామానికి చెందిన నర్సింహులు, ఎల్గోయి గ్రామానికి చెందిన నామ్‌దేవ్, రాణాపూర్‌కు చెందిన సంగన్న, మనూరుకు చెందిన సాయిలు, దుద్దగొండ గ్రామానికి చెందిన మాణిక్యంతో పాటు మరొకరు మృతి చెంది నెలలు గడుస్తున్నా వారికి రైతు బీమా డబ్బులు అందలేదు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ప్రశ్నించగా మృతిచెందిన రైతుల కుటుంబాలకు బీమా అందజేయాలని ఉన్నతాధికారులకు నివేదికలు అందజేసినా.. ఎలాంటి సమాచారం రాలేదని తెలిపారు. గతంలో రైతు మరణించిన వారం రోజుల్లో బీమా డబ్బులు అందాయని, ప్రస్తుతం మూడు నెలలవుతున్నా ఎందుకు అందడం లేదని రైతు కుటుంబాలు ప్రశ్నిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి బాధిత కుటుంబాలకు బీమా డబ్బులు అందేజేస్తే వారు కోలుకుని సాధారణ జీవితం గడపడానికి వీలుందంటున్నారు.

నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు

సిద్దిపేట క్రైం/గజ్వేల్ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): గంజాయి, ఇతర మత్తు పదార్థాల నివారణలో భాగంగా గజ్వేల్, సిద్దిపేట పట్టణ పరిధిలో పలు చోట్ల ఆదివారం పోలీసులు నార్కోటిక్ డాగ్స్‌తో విస్తృతంగా తనిఖీలను చేపట్టారు. పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశానుసారం సిద్దిపేట వన్ టౌన్ సీఐ వాసుదేవరావు ఆధ్వర్యంలో సిద్దిపేట న్యూ, మోడ్రన్ బస్టాండ్, కోమటి చెరువు తదితర ప్రాంతాల్లో, గజ్వేల్ గజ్వేల్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ ముత్యం రాజు ఆధ్వర్యంలో గజ్వేల్ బస్టాండ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, హనుమాన్ టెంపుల్ రోడ్డు, పట్టణ శివారు ప్రాంతాల్లో తనిఖీలను నిర్వహించారు.



గజ్వేల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో..

కొనుగోలు కేంద్రాల్లో ఆగని అక్రమాలు

బస్తాకు 44 కిలోల వడ్లు తూకం

- మోసాన్ని పసిగట్టిన రైతులు
- హమాలీలపై ఆగ్రహం
- తూకం నిలిపేసి ఆందోళన
- బచ్చురాజపల్లిలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై మండిపాటు



వడ్లు అధికంగా తూకం వేస్తున్నారని బచ్చురాజపల్లిలో కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

నిజాంపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): వరి కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు ఆగటం లేదు. నిజాంపేట మండల పరిధిలోని బచ్చరాజ్‌పల్లిలో ఐకేపీ సెంటర్‌లో ఆదివారం తూకంలో మోసాన్ని రైతులు పసిగట్టారు. 40 కేజీల బస్తాలో.. 43.9 కేజీలు తూకం వేస్తుండగా హమాలీలను నిలదీసి కాంటాను నిలిపివేశారు. బస్తాకు 4 కిలోలు ఎక్కువగా తూకం వేయడంపై ఆందోళన చేపట్టారు. నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓవైపు తూకంలో మోసాలను సహించబోమని కలెక్టర్ స్పష్టం చేసినా కొనుగోలు కేంద్రాల్లో మాత్రం అవకతవకలు బయటపడుతూనే ఉండటంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎప్‌సెట్‌లో మెదక్ జిల్లా విద్యార్థులకు ర్యాంకులు

మెదక్ కల్చరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఎప్‌సెట్-2025 ఫలితాల్లో మెదక్ జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన జిల్లా విద్యార్థులు ఎంసెట్ ఫలితాల్లో కూడా రాణించారు. మెదక్ పట్టణానికి చెందిన పతంగి వెంకట కైలాష్ 1,017 ర్యాంకు సాధించగా, సాయిలహరికి 4,629 ర్యాంకు వచ్చింది. ర్యాంకులు సాధించినందుకు వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వెంకట కైలాష్



సాయి లహరి



సికింద్లాపూర్‌లో కిరాణా దుకాణంలో బీర్లు కొనుగోలు చేస్తున్న యువకులు

మందెయ్.. చిందెయ్..

గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం

శివ్వంపేట, మే 11 (ఆంధ్రజ్యోతి) : శివ్వంపేట మండలంలోని గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. మండలంలోని 37 గ్రామపంచాయతీలు, గిరిజనతండాల్లో 200 వరకు బెల్ట్‌షాపులు ఉన్నట్లు అంచనా. కిరాణా దుకాణాలు, హోటళ్లల్లోనే మందు అమ్ముతున్నారు. ఉదయం నుంచే యువత మద్యం మత్తులో జోగుతున్నారు. మద్యం మత్తులో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఎక్సైజ్ అధికారులు స్పందించి బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల మహిళలు కోరుతున్నారు.



శివ్వంపేట మండలం గోమారంలో కిరాణ షాపులో విక్రయిస్తున్న మద్యం

కళలు, సాహిత్యంతో సామాజిక సమస్యల నుంచి విముక్తి



మాట్లాడుతున్న చక్రవర్తి వేణుగోపాల్

సిద్దిపేట కల్చరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): కళలు, సాహిత్యం ద్వారా సామాజిక సమస్యల నుంచి విముక్తి లభిస్తుందని సంస్కార భారతి తెలంగాణ రాష్ట్ర సంయుక్త ప్రధాన కార్యదర్శి చక్రవర్తి వేణు గోపాల్ పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో సంస్కార భారతి అనే అఖిల భారతసంస్థ మొదటిసారి సిద్దిపేట జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్ను కున్నారు. సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలిగా లక్కిరెడ్డి విజయ శుభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మద్దుల నవీన్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్షురాలు లక్కీరెడ్డి విజయరెడ్డి జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సంస్కార భారతి తెలంగాణ రాష్ట్ర సంయుక్త ప్రధాన కార్యదర్శి చక్రవర్తి వేణుగోపాల్ మాట్లాడుతూ.. సంస్కార భారతి అనేది అఖిల భారత సంస్థ అని, కళలు, సాహిత్యం ద్వారా సమాజంలోకి సంస్కారాలను తీసుకొనిపోవడమే దీని లక్ష్యమన్నారు. నేడు సమాజంలో లుప్తమవుతున్న విలువలను కాపాడే విధంగా సంస్కార భారతి కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. సంస్కార భారతి కేవలం కళలు, కళాకారులు మాత్రమే కాకుండా మొత్తం కళా జగత్తుకు సంబంధించి పని చేస్తుందన్నారు. అనంతరం సంస్థ విస్తరణ, కార్య పద్ధతి గురించి సంస్కార భారతి తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి జేపీ నిరంజన్ వివరించారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

నంగునూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని రాజగోపాలపేట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రాజగోపాలపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో పాలీసెట్ 2025-26 స్వల్పకాల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో నైపుణ్యం గల అధ్యాపకులతో వారం పాటు శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. నూతనంగా పాలిటెక్నిక్‌లో చేరే విద్యార్థులకు పాలిసెట్ పరీక్ష యొక్క విధానం, ప్రశ్నల సరళి, పాత ప్రశ్నాపత్రాల యొక్క అభ్యసనం చేయించి నమూనా పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పదవతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటుగా సిద్దిపేట, గజ్వేల్, గంబీరావుపేట నుంచి విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.



ఏడుపాయలలో వనదుర్గామాతను దర్శించుకుంటున్న భక్తులు



కొమురవెల్లి ఆలయ రాజగోపురప్రాంగణంలో భక్తజన సందోహం

ఆధ్యాత్మిక శోభ

- ఏడుపాయల వనదుర్గామాత, కొమురవెల్లి మల్లన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పలుచోట్ల జాతరలు ప్రారంభం... ఆకట్టుకున్న ఎడ్లబండ్ల ఊరేగింపు

పాపన్నపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన ఏడుపాయల ఆదివారం జనసంద్రంగా మారింది. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు మంజీరాపాయల్లో స్నానాలు చేసి దుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శంకర శర్మ, పార్థివ శర్మ అమ్మవారికి పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఒడి బియ్యం పోసి బోనాలు తీసి, భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

అట్టహాసంగా మల్లికార్జునస్వామి జాతర ప్రారంభం

అల్లాదుర్గం, మే 11 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని ఎల్లమ్మ దేవతకు, మల్లికార్జునస్వామికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నేడు ఆలయం వద్ద ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి నిర్వాహకులు తెలిపారు.

శతఘటాభిషేకంతో ముగిసిన జయంతోత్సవాలు

వర్గల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : నాచగిరి లక్ష్మీనృసింహస్వామి జయంతోత్సవాలు ఆదివారం శతఘటాభిషేకంతో ముగిశాయి. వేద మంత్రోశ్చరణల నడుమ స్వామివారికి విశేష పంచామృతాభిషేకాలతో పాటు శతఘటాభిషేకం నిర్వహించారు. యజ్ఞాచార్యులు శ్రీమాన్ అచ్యుత రామన్ ఆధ్వర్యంలో మూలమంత్ర హవనం, మహా పూర్ణహుతి చేశారు. ఈ వేడుకలకు భక్తులు విశేషంగా తరలివచ్చారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

సిద్దిపేట రూరల్,మే 11(ఆంధ్రజ్యోతి); సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు బండ శ్రీ స్వయంభూ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో ఆదివారం నరసింహ జయంతి ఉత్సవాన్ని ఆలయ వంశపారంపర్య అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా సుదర్శన నరసింహ హోమం ఘనంగా నిర్వహించారు. హోమం అనంతరం స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం స్థంభోద్భవ సమయంలో అర్చకులు సంప్రదాయబద్ధంగా డోలోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వంశపారంపర్య అర్చకులు కలకుంట సుమా రంగాచార్యులు హనుమాన్ దీక్షా స్వాములకు భిక్ష, ఉత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు.

మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ

చేర్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ సందర్శనార్థం ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లమ్మతల్లికి కల్లు, బెల్లంపానకం శాక పెట్టి బోనం నివేదించారు. ఎండతీవ్రత అధికంగా ఉండటంతో మధ్యాహ్నం వేళ భక్తుల రద్దీ మందకొడిగా ఉండగా, సాయంత్రం నుండి రాత్రి వరకు కొనసాగింది. ఇక మల్లన్న ఆలయంలో ఈనెల 15న కానుకలు, ఒడిబియ్యం హుండీలను లెక్కించనున్నట్లు ఈవో అన్నపూర్ణ తెలిపారు.



గడిపెద్దాపూర్‌లో ఎల్లమ్మదేవతకు బోనాలను ఊరేగిస్తున్న భక్తులు



నాచగిరి క్షేత్రంలో శతఘటాభిషేకం చేస్తున్న వేద పండితులు

కాటేజీ నిర్మాణానికి రూ.15లక్షల విరాళం

ఆలయ పరిధిలో డోనార్ స్కీం ద్వారా రూ.17కోట్ల వ్యయంతో 100గదుల సత్ర భవన నిర్మాణానికి చర్యలు తీసుకున్న నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన ఉప్పల కోటేశ్వర్‌రావు ఆదివారం ఒక కాటేజీ నిర్మాణం కోసం రూ.15లక్షలు విరాళ చెక్కును ఆదివారం ఈవో అన్నపూర్ణకు అందచేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

తుర్కపల్లి జాతరలో ఆకట్టుకున్న బండ్ల ప్రదర్శన

నారాయణఖేడ్, మే 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుర్కపల్లి భూలక్ష్మమ్మ జాతర ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. భూలక్ష్మమ్మ తల్లి గారి గ్రామమైన ఎల్గోయి నుంచి ఆ గ్రామస్థులు పెద్దఎత్తున బండ్లను తీసుకొచ్చి తుర్కపల్లి వచ్చి అమ్మవారి గుడి చుట్టూ ప్రదర్శనలు చేయించారు. కామారెడ్డి జిల్లా ధర్మారం, తదితర గ్రామాల నుంచి కూడా భక్తులు బండ్లను తీసుకొచ్చారు. సాయంత్రం నుంచి బండ్ల ప్రదర్శన నిర్వహించారు. రాత్రి బోనాల ప్రదర్శన అట్టహాసంగా చేపట్టారు. భూలక్ష్మమ్మను దర్శించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి అనేక మంది ఉదయం నుంచే తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవాల్లో దాదాపు వందకుపైగా బండ్లతో ప్రదర్శన నిర్వహించారు. జాతర ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులు పొర్లుడు దండాలు, అన్నదానం, తదితర మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి, ఎల్గోయి గ్రామాలకు చెందిన ప్రముఖులు, యువకులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన అన్ని ఏర్పాటు చేపట్టారు. కాగా జాతర సందర్భంగా భూలక్ష్మమ్మ తల్లిని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి, తదితరులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జాతరలో చిన్నారులను ఆకట్టుకునే విధంగా వివిధ రకాల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. నారాయణఖేడ్ పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు.

రేణుకా ఎల్లమ్మ జాతరకు వేళాయే

- నేటి నుంచి నెల రోజుల పాటు...
- జాతరకు ఏర్పాట్లు పూర్తి

హుస్నాబాద్. మే 11 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ జాతర సోమవారం నుంచి ప్రారంభంకానుంది. యేటా వైశాఖ మాసం పౌర్ణమి నుంచి ఈ జాతర ప్రారంభమై నెల రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ నెల రోజుల కాలంలో లక్షలాది మంది భక్తులు పిల్ల పాపలతో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకుంటారు. ఇక హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ విగ్రహం దాదాపు 20 అడుగుల ఎత్తులో గంబీర్యంగా ఉంటుంది. కాకతీయుల కాలంలో రుద్రమదేవి ఇక్కడ చెరువు నిర్మించినప్పుడు ఈ ఎల్లమ్మ గుడిని నిర్మించినట్లు చెబుతారు. హుస్నాబాద్ ప్రాంతంలో ఈ పౌర్ణమిని ఎల్లమ్మ పౌర్ణమిగా ప్రమాణికంగా తీసుకొని కాలగణన చేస్తారు. బమ్మెర పోతన్న, సర్వాయి పాపన్నలాంటి ఎందరో మహానీయులు దర్శించినట్లు చరిత్ర కారులు చెబుతారు.

ఎల్లమ్మ పౌర్ణమి రోజైన సోమవారం ఉదయం జాతర సిద్దోగంతో ప్రారంభమవుతుంది. ఎల్లమ్మ దేవిని స్తుతిస్తూ ఆమె చరిత్రను పంబాల పూజారులు ఆటపాటల ద్వారా వివరిస్తారు. దాదాపు 6గంటల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఈ జాతరకు హుస్నాబాద్ చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా మహారాష్ట్రలోని చంద్రాపూర్, షోలాపూర్, బీదర్, హైదరాబాద్, నిజామాబాద్, జనగామ, మెదక్, సంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, జగిత్యాల,పెద్దపల్లి, భువనగిరి జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు హాజరై మొక్కులు సమర్పించుకుంటారు. ప్రతి ఆది, మంగళవారాల్లో మాత్రం ఎక్కువ సంఖ్యలో భక్తులు మొక్కులు సమర్పించుకుంటారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జాతర ఏర్పాట్లపై ఇప్పటికే అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మూత్రశాలలు, మంచినీటి కోసం మినరల్ వాటర్ ప్లాంట్‌తో పాటు. వాటర్ ట్యాంకులు, చలువ పందిల్లు వేయిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో హెల్త్ క్యాంపు, పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



ముస్తాబైన రేణుకా ఎల్లమ్మ ఆలయం



ఆలయ ఆవరణలో భక్తులు

క్రైం కార్నర్



అడవి దుప్పి కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

దుప్పిని చంపితిన్న చిరుత

● కాట్రియాల తండా శివారులో ఘటన

రామాయంపేట, మే 11 (ఆంధ్రజ్యోతి) : చిరుత దుప్పిని చంపితిన్న ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధి కాట్రియాల తండా శివారులో ఆదివారం చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. చిరుత రెండు కూనలను వెంటేసుకొని తండా అనుకొని సంచరిస్తుండగా పొలాల్లోకి వెళ్తున్న రైతులు గమనించారు. వెంటనే అందరూ కలిసి దాన్ని తరమటంతో అడవిలోకి పారిపోయింది. అనంతరం ఆ ప్రాంతంలో దుప్పి కళేబరాన్ని గుర్తించి రైతులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలికి చేరుకుని చిరుత ఆనవాళ్లను గుర్తించారు. అనంతరం దుప్పి కళేబరానికి పోస్టుమార్టం చేసి ఖననం చేశారు. రైతులు రాత్రి వేళల్లో పొలం పనులకు వెళ్లొద్దంటూ అధికారులు సూచించారు.

వారం రోజులుగా సంచారం..

చిన్నపిల్లలను వెంటేసుకొని చిరుత వారం రోజులుగా తమ నివాసాలకు దగ్గరలోనే సంచరిస్తుందని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. వారం క్రితం మండలంలోని కోనాపూర్ చిన్నతండాలోనూ చిరుత కనిపించిందని తెలిపారు. అధికారులు వీలైనంత తొందరలో చిరుత బంధించి తమకు రక్షణ కల్పించాలని వారు కోరారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి

● మరొకరి పరిస్థితి విషమం



మృతి చెందిన శేఖర్

పాపన్నపేట, మే 11 (ఆంధ్రజ్యోతి) : రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు చనిపోగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కుర్తివాడ గ్రామానికి చెందిన కర్రెల శేఖర్(60) నిత్యం హనుమాన్ ఆలయం వద్ద పరిసరాలు శుభ్రం చేస్తుంటాడు. ఆదివారం టీవీఎస్ మోపెడ్‌పై కుర్తివాడ నుంచి పాపన్నపేట వైపు వస్తుండగా మిన్పూర్ గ్రామం నుంచి మెదక్ వైపు వెళ్తున్న బైక్ ఢీ కొట్టింది. దీంతో కర్రెల శేఖర్, బైక్‌పై ఉన్న కిష్టయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కర్రెల శేఖర్ మృతి చెందగా, తీవ్ర గాయాల పాలైన కిష్టయ్యను మెదక్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు భార్యలు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..



ప్రవీణ్ మృతదేహం

చేగుంట, మే 11 (ఆంధ్రజ్యోతి) : బైకు అదుపు తప్పి యువకుడు మృతి చెందాడు. చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం ప్రకారం రామాయంపేట మండలం దంతేపల్లి గ్రామానికి చెందిన కేసరి ప్రవీణ్ (25) తమ బంధువులు కర్నాంపల్లి రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యాడు. తిరిగి వెళ్తుండగా చిన్నశివనూర్ గ్రామ శివారులోని చేగుంట గజ్వేల్ రహదారిపై బైక్ అదుపుతప్పి కిందపడడంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో బాలుడు..


హవేళిఘణపూర్, మే11 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. లింగ్సాన్‌పల్లి తండాకు చెందిన దరావత్ మోహన్ కుమారుడు రీతు (10) పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో ఇంటివద్ద తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం దాబా పైకి ఎక్కి స్లాబ్‌కున్న ఇనుప చువ్వలను పట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చేగుంట, మే 11(ఆంధ్రజ్యోతి): నార్సింగ్ మండలం నర్సంపల్లి అటవీ ప్రాంతంలో ఆదివారం తునికాకు సేకరణకు వెళ్లిన గ్రామస్థులకు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. ఈ విషయమై గ్రామస్థులు నర్సింగ్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించగా మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి స్థితిలో ఉండడంతో శవ పంచనామా నిర్వహించారు. సుమారు 50 నుంచి 60 సంవత్సరాలు వయసు ఉంటుందని, సుమారు నెల క్రితం మృతి చెంది ఉంటారని పోలీసులు తెలిపారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

రిజర్వాయర్ల వద్ద తరచూ ప్రమాదాలు



మంజీరా రిజర్వాయర్ వద్ద జలకాలాడుతున్న యువకుడు

● నీటిలో కలుస్తున్న ప్రాణాలు
● విషాదం నింపుతున్న విహార యాత్రలు
● జాగ్రత్త చర్యలు చేపట్టని అధికారులు
● పర్యాటక కేంద్రాల్లో వసతులు కరువు



మంజీరా తీరాన రీల్స్ తీస్తున్న యువకులు

సంగారెడ్డి రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఆహ్లాదం కోసం రిజర్వాయర్ల పర్యటనకు వెళ్లే వారి కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకుంటున్నాయి. రిజర్వాయర్ల వద్ద అధికారులు ఎలాంటి జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడంతోనే తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయనే విమర్శలు ఉన్నాయి. సంగారెడ్డి మండలం కల్పగూర్ గ్రామ సమీపంలోని మంజీరా బ్యారేజీకి సంగారెడ్డి చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా హైదరాబాద్, కర్నాటక, బీదర్, మహారాష్ట్ర నుంచి సందర్శకులు వస్తుంటారు. నీటిలో ఈత కొడుతూ, సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తుంటారు. అదేవిధంగా మరికొందరు రీల్స్ చేసేందుకు నీటి ప్రవాహం వరకు వెళ్లడం వల్ల ప్రమాదాలకు గురై నదిలో కొట్టుకుపోయి మృత్యువాత పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. వారం రోజుల కాలంలో సిద్దిపేట జిల్లా రంగనాయక్‌సాగర్ రిజర్వాయర్‌కు వచ్చిన రెండు కుటుంబాలు ఈత కొడుతున్న క్రమంలో ఇద్దరు నీట మునిగి చనిపోయిన ఘటన మనందరికీ తెలిసిందే. వేసవి సెలవులు కావడంతో సింగూరు బ్యారేజీ, సంగారెడ్డి పరిధిలోని మంజీరా బ్యారేజీలకు పర్యాటకులు భారీగా వస్తున్నారు. అయినా రిజర్వాయర్ల వద్ద అధికారులు సీసీ కెమెరాలు, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శమని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం పర్యాటక కేంద్రాల వద్ద ముదస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

అరకొర సౌకర్యాలు..

ఓ పక్క ప్రభుత్వం పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయాలని చెబుతున్నప్పటికీ ఆ దిశగా అడుగులు పడడం లేదన వాదనలు వినిపిస్తున్నాయి. అరకొర వసతులు ఉండడంతో పర్యాటకులు ఇబ్బందులకు గురవుతున్నారు. సుదూరు ప్రాంతాల నుంచి వచ్చేవారు తమ కుటుంబ సభ్యులతో ఉదయం నుంచి సాయంత్రం సేద తీరుదామని అనుకున్నా సరైన సౌకర్యాలు లేక మధ్యలోనే వెళ్లిపోతున్నారు. సదుపాయాలు కల్పిస్తే సందర్శకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



వేసవి సెలవులు ఉన్నందున కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు మంజీరా బ్యారేజీకి వచ్చాం. పర్యాటకుల కోసం ఏవైనా తినుబండరాలు దొరికేలా ఏర్పాటు చేస్తే బాగుంటుంది. పిల్లలతో కలిసి బోటు షికారు చేసేలా అందుబాటులో తేవాలి. అనుకున్న విధంగా ఇక్కడ సౌకర్యాలు లేవు.

- బోగుడ అనిత, సంగారెడ్డి

జాగ్రత్త చర్యలు చేపట్టాలి



పర్యాటక కేంద్రాలైన సింగూరు, మంజీరా బ్యారేజీల వద్ద ప్రమాదాలు జరగకుండా అధికారులు జాగ్రత్త చర్యలు చేపట్టాలి. రిజర్వాయర్ల వద్ద ప్రమాదాలు జరగకుండా సీసీ కెమెరాలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలి.

-జీ.సాయిలు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు

రాముడు ప్రపంచానికే ఆదర్శం

● పహల్గాం కన్నీటికి సైనికులు బదులు తీర్చుకుంటారు
● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



ఎంపీ రఘునందన్ రావును సన్మానిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రమణాచారి

నంగునూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): అన్నదమ్ముల అనుబంధానికి శ్రీరాముడు ఆదర్శమని మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావు అన్నారు. నంగునూరు మండలం నర్మెటలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో శ్రీరాముడు అడవికి వెళ్తే తమ్ముడు ఆయన వెంట నడిచారని, సీతమ్మ తల్లి కన్నీరు పెడితే రామరాజ్యం కోసం అరణ్యవాసం చేసిన శ్రీరాముడు ఎంతో ఆదర్శమన్నారు. ఈరోజు ఆడబిడ్డల కన్నీటికి కారణమైన సిందూరం తుడ్చివేస్తే దేశమంతా సైనికుల వైపు నిలిచి పాకిస్థాన్ ముష్కరులను తూర్పి పెట్టేందుకు మద్దతు పలికిందన్నారు. అంతకుముందు ఎంపీ రఘునందన్ రావుకు పూర్ణకుంభంతో వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ రఘునందన్‌ను ఆలయ కమిటీ చైర్మన్ రమణాచారి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెస్‌ఎఫ్ జాతీయ నాయకులు లింగంపల్లి శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ రాళ్ల బండి రమణాచారి, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, నాయకులు తిరుపతి రెడ్డి, యాదమల్లు, పప్పు సురేందర్, కలకుంట్ల స్వామి, సింహ కిషోర్, నార్లపురం ఎల్లయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్ మ్యాచ్‌లు

● 13 నుంచి జట్ల ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, మే 11(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి ఉమ్మడి మెదక్ జిల్లాలో అండర్-25 ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు జరగనున్నాయని మెదక్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి లీగ్ మ్యాచ్‌లలో పాల్గొనే రెండు జట్ల ఎంపికలు నూతన జిల్లాల వారీగా జరగనున్నాయని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాకు సంబంధించి ఈ నెల 13న సంగారెడ్డి జూబ్లీక్లబ్ ప్రాంగణంలోని ఎం.ఎస్. అకాడమీలో ఎంపిక జరగనున్నట్లు తెలిపారు. అలాగే 14 న మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో, 16న సిద్దిపేటలోని జయశంకర్ మినిస్టేడియంలో జరుగుతాయని తెలిపారు. క్రీడాకారులు ఉదయం 10 గంటల వరకు ఆయా ప్రాంతాలకు ఒరిజినల్ ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, రెండు ఫోటోలతో హాజరుకావాలని సూచించారు.

ఉగ్రవాదాన్ని తరిమికొడదాం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

బెజ్జంకి, మే 11 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఉగ్రవాదాన్ని సహించేది లేదని, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సీపీఐ పూర్తి మద్దతు తెలిపినట్లు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి తెలిపారు సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో ఆదివారం నిర్వహించిన మండల 13వ మహాసభకు జిల్లా కార్యదర్శి మంద పవన్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండాను ఎగురవేశారు. ఉగ్రదాడిలో మృతి చెందిన వీర జవాన్లు, పర్యాటకులకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ సరిహద్దు వెంబడి పాకిస్తాన్ దుశ్చర్యలకు పాల్పడుతుందన్నారు. భారతదేశం సువిశాలమైనదని, జమ్మూ కాశ్మీర్‌కు వచ్చిన పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులకు పాల్పడితే నిఘా వర్గాలు ఏం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్‌తో పాక్ ఉగ్రదాడిని సమర్థవంతంగా ఎదుర్కొంటున్న సైనికులకు వందనాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక కర్షక విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పై సీపీఐ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. ఈ నెల 20న చేపట్టే సార్వత్రిక సమ్మెను విజవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి, మండల కార్యదర్శి రూపేష్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మధు, మహేష్, చరణ్, బాలమల్లు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ జెండాను ఎగురవేస్తున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

మహిళ ప్రాణం తీసిన వాటర్ హీటర్



భాగ్య(ఫైల్)

పాపన్నపేట, మే 11 (ఆంధ్రజ్యోతి) : వాటర్ హీటర్ షాక్ తగిలి మహిళ మృతిచెందిన సంఘటన మెదక్ జిల్లా మండల కేంద్రమైన పాపన్నపేటలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన బెస్త భాగ్య, భూపతి దంపతులకు ఇద్దరు కూతుళ్లు. ఆదివారం ఉదయం భర్త చేపలు పట్టేందుకు నదికి వెళ్లగా.. సెలవులు ఉండడంతో పిల్లలు అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్లారు. భాగ్య(36) స్నానం చేసేందుకు బకెట్‌లో వాటర్ హీటర్ పెట్టింది. మరిచిపోయి నీళ్ల వేడి అయ్యాయో.. లేవోనని చెయ్యి అందులో పెట్టింది. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఇంటికి వచ్చిన భర్త బకెట్ వద్ద విగత జీవిగా పడి ఉన్న భార్యను చూసి చుట్టుపక్కల వారిని పిలిచి, లేపే ప్రయత్నం చేశాడు. కాగా అప్పటికే భాగ్య మృతిచెందిందని స్థానికులు తెలిపారు. ఈ విషయమై స్థానిక ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్‌ను వివరణ కోరగా.. తమకు ఫిర్యాదు రాలేదని చెప్పారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడుతున్న దొంగలు

తగిన జాగ్రత్తలు తప్పనిసరంటున్న పోలీసులు

సిద్దిపేట క్రైం, మే 11 (ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యాసంస్థలకు సెలవులు ఉండడంతో పలువురు ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా విహారయాత్రలు, పుణ్యక్షేత్రాలు, తమ స్వగ్రామాలకు వెళ్తుంటారు. ఇదే అదునుగా భావిస్తున్న దొంగలు తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్నారు. ఈ మధ్యకాలంలో సిద్దిపేట పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శంకర్‌నగర్‌లో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బంగారం వెండి ఆభరణాలతో పాటు, నగదును దోచుకెళ్లారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్ట పగలే తాళం వేసిన ఇంటిని లూటీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లే వారికి ఇళ్లను కూడా దొంగలు టార్గెట్ చేసి ఉన్నదంతా అపహరించుకుని వెళ్తున్నారు. రాత్రిపూట పోలీసులు పెట్రోలింగ్, బ్లూ కోర్ట్స్ నిఘా ఉన్నప్పటికీ చోరీలు మాత్రం ఆగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో తాళం వేసిన ఇళ్లలో పగటిపూటనే దొంగలు చోరీలకు పాల్పడుతుండడంతో ప్రజలను ఆందోళన కలిగిస్తుంది. దొంగతనం తర్వాత క్లూస్ టీం సహాయంతో నూతన టెక్నాలజీతో, సీసీ కెమెరాలు, వేలిముద్రల ఆధారంగా దొంగలను పట్టుకున్నప్పటికీ బాధితులకు మాత్రం పూర్తిస్థాయిలో సొమ్ము రికవరీ కావడం లేదు. కొన్ని దొంగతనాల కేసులలో దొంగలు క్లూస్ టీంకు ఆధారాలు దొరకకుండా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది.

గత ఏడాది 709 కేసులు

గత ఏడాది 709 దొంగతనాల కేసులు నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. మొత్తం సొత్తు రూ.3,10,97,968 పోగా, వాటిలో పోలీసులు 40శాతం రికవరీ చేశారు. ఈ ఏడాది ఇప్పటివరకు 86 దొంగ తనాల కేసులు నమోదు కాగా, 66 కేసులలో పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి దొంగలు ఎత్తుకెళ్లిన సొత్తు రూ.31,39,050లో రూ.19,06,729 (59.85శాతం) రికవరీ చేశారు.



అప్రమత్తంగా ఉండాలి : సీపీ అనురాధ

అప్రమత్తతోపాటు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే పూర్తిస్థాయిలో దొంగతనాలు అరికట్టవచ్చునని సిదిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ తెలిపారు. ముఖ్యంగా పోలీసుల సలహాలు, సూచనలు పాటించాలని చెప్పారు.

పోలీసుల సూచనలివే..

- దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌ను పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చి వెళ్లాలి.
- ఇరుగుపొరుగు వారికి ఇంటిని కనిపెట్టుకోమని చెప్పాలి.
- కాలనీలు, ఇంటి పరిసరాలు, షాపింగ్ మాల్స్‌ల్లో సీసీ కెమెరాలను విధిగా అమర్చుకోవాలి.
- కిటికీల వద్ద ఇంటి తాళాలు పెట్టి నిద్రించకూడదు.
- వేసవిలో కిటికీకు తెరిచి నిద్రిస్తుంటారు. దొంగలు కిటికీల్లో నుంచి నీళ్ల చల్లి బయటకు రాగానే దోచేస్తారు.
- ఇంటి తాళం కనబడకుండా డోర్ కర్టెన్ వేయాలి.
- మహిళలు బయటకు వెళ్లే సమయంలో మెడచుట్టూ కొంగు కప్పుకొని వెళ్లాలి.
- ఊరెళ్తున్నప్పుడు ఇంట్లోని ఒక గదిలో లైటు వేసి ఉంచాలి
- విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు.
- తాళం చెవి ఇంటి పరిసర ప్రాంతాల్లో పెట్టకూడదు.
- అపార్ట్మెంట్లలో కాలనీలలో నమ్మకమైన సెక్యూరిటీ గార్డులను, వాచ్‌మన్‌లను నియమించుకోవాలి.
- అనుమానాస్పద వ్యక్తులుంటే స్థానిక పెట్రోలింగ్ పోలీసులకు, పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలి.
- ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం. లేదా ఎక్కువ రోజులు ఊరేళ్లేవారు వెంట తీసుకెళ్లాలి.
- ఇంటి డోర్‌కు సెంట్రల్ లాకింగ్ సిస్టంట్‌ను ఏర్పాటు చేసుకోవడం సురక్షితం.
- తమ ప్రాంతంలో గస్తీ ఏర్పాటుకు సహకరించాలి. పోలీసు స్టేషన్ నెంబర్, వీధుల్లో వచ్చే బ్లూ కోల్ట్స్,పెట్రో కార్ పోలీస్ సిబ్బంది నంబర్లను దగ్గర పెట్టుకోవాలి.
- అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712667100కు సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుంది.

నీటి సమస్య పరిష్కారానికి అమృత్ 2.0

● రూ.12 కోట్లతో రెండు భారీ ట్యాంకులు
● కిలోమీటర్ల మేర పైపులైన్ పనులు


అమృత్‌లో భాగంగా కొనసాగుతున్న ట్యాంకు పనులు

నర్సాపూర్, మే 11 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలో పెరుగుతున్న జనాభాకు తగ్గట్టు భవిష్యత్‌లో మంచినీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.12 కోట్లతో రెండు భారీ ట్యాంకుల నిర్మాణ పనులు మొదలయ్యాయి. నర్సాపూర్ పట్టణంలో ప్రస్తుతం 25 వేల జనాభా ఉండగా.. 6,752 నివాస గృహాలు, 31 ట్యాంకులు ఉన్నాయి. వీటి ద్వారా 3,722 నల్లా కలెక్షన్లకు మిషన్ భగీరథ ద్వారా నీరందుతున్నా.. జనాభాకు తగ్గట్టు సరిపోవడం లేదు. మిషన్‌భగీరథ పథకం నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో తరచూ లీకేజీలు ఇతర మరమ్మతుల కారణంగా పట్టణవాసులకు తాగునీటి సమస్య తలెత్తుతుంది. ప్రత్యామ్నాయంగా స్థానిక బోర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా.. అవి కూడా అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. కొత్తగా అమృత్ 2.0 కింద మంజూరైన ట్యాంకుల నిర్మాణంతో ఈ సమస్య తీర్చనున్నదని స్థానికులు ఆశిస్తున్నారు.

చకచకా ట్యాంకుల పనులు

అమృత్ 2.0 పథకం కింద నర్సాపూర్ మున్సిపాలిటీకి రూ.12 కోట్లు మంజూరు కాగా.. వాటితో నర్సాపూర్-మెదక్ ప్రధాన రోడ్డులో మియావాకి ప్లాంటేషన్ వద్ద 750 కేఎల్ నీటి నిల్వ సామర్థ్యం కలిగిన భారీ ట్యాంకులను నిర్మిస్తున్నారు. మరొకటి 800 కేఎల్ సామర్థ్యం గల ట్యాంకును 4వ వార్డులోని లింగమయ్య ఆలయం సమీపంలో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ట్యాంకుల నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. వీటితో పాటు 12 కిలోమీటర్ల మేర కొత్తగా పైపులైన్ కూడా వేయనున్నారు. ఈ పనులు పూర్తయితే నర్సాపూర్ పట్టణంలో నీటి సమస్య ఉండదని చెప్పొచ్చు.

నేడు రామాయంపేట తైబజార్ వేలం

● ఇప్పటికీ మూడుసార్లు వాయిదా
● తైబజార్ రద్దు చేయాలంటున్న చిరు వ్యాపారులు


రామాయంపేట మున్సిపల్ కార్యాలయం

రామాయంపేట, మే 11 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట పురపాలికలో ఇప్పటికీ మూడు మార్లు తైబజార్ వేలం వాయిదా పడింది. అయినా తిరిగి సోమవారం బహిరంగ వేలానికి సిద్ధమయ్యారు. ఇదివరకు డిపాజిట్ దారులు ఎక్కువగా పాట పాడి తీవ్రంగా నష్టం చవిచూశారు. అంతేకాదు అత్యధికంగా వసూలు చేస్తున్నారంటూ కూరగాయల వ్యాపారులు శాపనార్థాలు పెడుతున్నారు. దీంతో ఓవైపు అత్యధికంగా పాట పాడి నష్టాలు చూడగా మరోపక్క చిరు వ్యాపారులతో గొడవ ఇష్టం లేక ముందుకు రావడం లేదు. అందువల్ల తైబజార్ వేలం ముగిసి రెండు మాసాలు అవుతున్నా డిపాజిట్ దారులు ఆసక్తి చూపటం లేదు. ఇదివరకు రూ.10 లక్షల దాకా పలికిన వేలంపాట, పోయిన సారి ఏకంగా రూ.2ఏ లక్షలకు దక్కించుకున్నారు. దీనివల్ల మున్సిపల్‌కు కట్టాల్సిన డబ్బులు సరిపోని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు తక్కువ పాట పాడేందుకు కూడా ఎవరూ రావడం లేదు.

తైబజార్ వసూళ్లు రద్దు చేయాలి

తైబజార్ వేలం రద్దు చేయాలని చిరు వ్యాపారులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు. రోజువారీ మార్కెట్‌తో పాటు సంత రోజున తాము గంపల్లో తెచ్చి అమ్మే కూరగాయలకు రూ.50 చెల్లించడం భారం అవుతుందన్నారు.

దేశ సేవకు మా బిడ్డలను పంపుతాం


ఖేడ్ మండలం పలుగుతండాలో ప్రతిజ్ఞ చేస్తున్న గిరిజన మహిళలు


కొండాపూర్ : మారేపల్లి లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

నారాయణఖేడ్/కొండాపూర్, మే 11 (ఆంధ్రజ్యోతి) : దేశ సేవకు తమ బిడ్డలను కూడా పంపిస్తామని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం పలుగుతండాకు గిరిజన మహిళలు పేర్కొన్నారు. యుద్ధంలో అమరుడైన జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి ఆదివారం నివాళులర్పించి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ మాట్లాడుతూ తమ బిడ్డలను దేశ సేవకు పంపుతామన్నారు. అంతకుముందు సైన్యంలో పని చేస్తూ, జవాన్లకు శిక్షణ ఇస్తున్న హవల్‌దార్ బోయిని పండరిని సన్మానించారు. పాకిస్తాన్ ఉగ్రమూకలను తుదముట్టించి, మట్టి కరిపించి భారత దేశం విజయబావుట ఎగురవేసి గెలువాలి, ధర్మం నిలవాలి అని ఆదివారం కొండాపూర్ మండల పరిధిలోని మారేపల్లి లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దేశం కోసం వీర మరణం పొందిన సైనికుల త్యాగాలు వృథా కావని కొనియాడారు.

కార్మిక సంఘాల పోరాట ఫలితంగానే హక్కుల సాధన

● శ్రమశక్తి అవార్డు గ్రహీత నర్సింహారెడ్డి సన్మాన సభలో ఎంపీ సురేష్‌షెట్కార్

పటాన్‌చెరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల శ్రేయస్సు, హక్కుల కోసం నిరంతరం పోరాడే కార్మిక సంఘాల వల్లే హక్కుల పరిరక్షణ సాధ్యమవుతోందని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం శ్రమశక్తి అవార్డు పొందిన ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కే.నర్సింహారెడ్డిని పారిశ్రామిక వాడ ట్రేడ్ యూనియన్, కాంగ్రెస్ నాయకులు ఆదివారం పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ సురేష్‌షెట్కార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కులను ఐక్యంగా ఉంటూ కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, కార్పొరేటర్ పుష్పానగేష్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, హెచ్ఎంఎస్ జాతీయ కార్యదర్శి సుదర్శన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవనం బేస్‌మెంట్ ఎత్తు పెంపు


బేస్‌మెంట్‌ఎత్తు పెంచుతున్న దృశ్యం

రేగోడు, మే 11 (ఆంధ్రజ్యోతి) : రేగోడు మండలంలో గ్రంథాలయ భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఏప్రిల్ 7న 'గ్రంథాలయ భవనం పనులు ముమ్మరం' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించి పనులు చేపడుతున్నారు. అయితే బేస్‌మెంట్‌ను రోడ్డు కంటే తక్కువ ఎత్తులో నిర్మించారు. వర్షం పడితే నీళ్లు వెళ్లే ప్రమాదం ఉందని పలువురు పేర్కొనడంతో అధికారులు స్పందించారు. బేస్‌మెంట్ ఎత్తు పెంచారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరం

● మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

నిజాంపేట, మే 11 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో ఆదివారం ఆర్ఎంపీ, పీఎంపీ ఆధ్వర్యంలో శ్రీకర హాస్పిటల్ వైద్యులచే ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎస్పీ, రాచకొండ డీసీపీ నరసింహారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత వాసులు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో సుమారు 300 పైగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొబేషనరీ ఎస్ఐ సృజన, శ్రీకర హాస్పిటల్ జనరల్ మేనేజర్ రవికుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి

● ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్


ఖేడ్‌లో మాట్లాడుతున్న జ్ఞానేశ్వర్

నారాయణఖేడ్, మే 11(ఆంధ్రజ్యోతి) : ముదిరాజ్‌ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ అన్నారు. ఆదివారం ఖేడ్‌కు వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కామారెడ్డిలో జరిగిన బీసీ డిక్లరేషన్‌లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. రాబోయేరోజుల్లో ముదిరాజ్‌ల సమస్యలపై లక్షమందితో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించి తమ డిమాండ్ల సాధనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలగాని నర్సింలు, నాయకులు సురేష్, శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు అల్కారి సత్యనారాయణ, శంకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అమర జవాన్‌కు చిత్ర నివాళి


మురళీనాయక్ చిత్రాన్ని రావి ఆకుపై వేసిన లీఫ్ ఆర్టిస్టు

నారాయణఖేడ్, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలోని కల్లితండా గ్రామానికి చెందిన భారత జవాన్ మురళీ నాయక్ వీర మరణం పొందాడు. దీంతో మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు రావి ఆకుపై ఆయన చిత్రాన్ని వేసి నివాళులర్పించారు.

ఎప్‌సెట్ ఫలితాల్లో.. 'శ్రీఅక్షయ', 'సెయింట్ ఆంథోనీస్'కు ర్యాంకులు


అపర్ణ, అభిరామ్, శ్రుతిక

సంగారెడ్డి అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఎప్‌సెట్-2025 ఫలితాల్లో మల్కాపూర్ చౌరస్తా సమీపంలోని శ్రీఅక్షయ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో పి.అపర్ణ 1542 ర్యాంకు, కె.అభిరామ్ 1735, వి.శ్రుతిక 4795, ఎ.అభిషేక్ 5026, వై.దుర్గసాయిమనోజ్ 8617, ముదాసిరుద్దీన్ 9822, సారిక 10737, గణప్రీత్ 15303 ర్యాంకు సాధించారు. ఇక అగ్రికల్చర్-ఫార్మసీ విభాగంలో ఇ.సాయిపూజిత 6588 ర్యాంకు, రాణా తబస్సుమ్ 7712, పి.నిహారిక 7748, సుప్రియగరాంగ్ 9712, విష్ణుప్రియ 15453, కె.అఖిల 13803 ర్యాంకులు సాధించారు. వీరితో పాటు 13 మంది విద్యార్థులు 20 వేల లోపు ర్యాంకు సాధించి సత్తా చాటారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ వీరప్ప, ప్రిన్సిపాల్ శ్రీశైలం, అకాడమిక్ డైరెక్టర్ భానుచందర్‌రెడ్డి, డైరెక్టర్లు రాజుగౌడ్, సుధాకర్ జోషీలు అభినందించారు.

సెయింట్ ఆంథోనీస్‌కు ర్యాంకు పంట

సంగారెడ్డి శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎప్‌సెట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో శ్రీనిధిరెడ్డి 10352 ర్యాంకు, అగ్రికల్చర్ విభాగంలో జైనబ్ 8236 ర్యాంకు, ఆయేషా తబస్సుమ్ 9293, శిరీష 10013, మహాలక్ష్మి 10211, నిషత్ సిద్దిఖా, 13929 ఫలితాల్లో సాధించారు. ఇంకా 20 వేల ర్యాంకులలోపు 15 మంది విద్యార్థినులు సాధించారు. వీరిని కళాశాల చైర్మన్ ఈ.సాల్మన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఈ.జ్యోతిరెడ్డి అభినందించారు.

ఎప్‌సెట్‌లో 'గీతా' విద్యార్థుల ప్రతిభ


షేక్ అక్రమ్, కేతావత్ ఆశీర్వాదం, సాయి నిహంత్

తూప్రాన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఎప్‌సెట్-2025 ఫలితాల్లో తూప్రాన్ గీతా కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఇంజనీరింగ్ విభాగంలో షేక్ అక్రమ్(4887) ర్యాంకు, కేతావత్ ఆశీర్వాదం(5164) ర్యాంకు, ఏ.సాయి నిహంత్(5347) ర్యాంకుతో ప్రతిభ చూపారు. ప్రతిభచూపిన విద్యార్థులను కరస్పాండెంట్ పి.రామాంజనేయులు, చైర్‌పర్సన్ పి.ఉష, డైరక్టర్లు బి.రాఘవేందర్‌గౌడ్, కే.నారాయణగుప్తా, ఎంవీ కృష్ణ, కేవీ ప్రసాద్, ప్రిన్సిపాల్ టి.రాజు, అధ్యాపకులు అభినందించారు.

న్యూస్ బాక్స్

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత


చెక్కులు అందజేస్తున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, మే 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య ఖర్చుల కోసం మండల పరిధిలోని ర్యాకల్‌కు చెందిన మహ్మద్ సలామద్దీన్‌కు రూ.60 వేలు, మండల కేంద్రమైన నిజాంపేటకు చెందిన సాయమ్మకు రూ.18 వేలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కులను మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్హేర్ మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు జగదీశ్వర్‌చారి, రాంచందర్‌పటేల్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సన్మానం

కంగ్టి, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జంగి.కెలో ఇటీవల పోలీస్‌శాఖలో ఉద్యోగాలు సాధించిన నలుగురిని ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. గ్రామానికి చెందిన చిట్టిపు, సురేందర్‌రెడ్డి, వాందాస్, అఖిల్, రాజు పోలీస్ శాఖలో కానిస్టేబుల్స్‌గా ఉద్యోగాలు పొందారు. వీరితో పాటు పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన వైష్ణవి, కవితను కూడా మెమొంటో, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ బాధ్యులు ప్రవీణ్‌చారి, సంతోష్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లిలో ఎల్లమ్మదేవి కల్యాణం

రేగోడు, మే 11 (ఆంధ్రజ్యోతి) : రేగోడు మండలం మర్పల్లి గ్రామ శివారులోని ఆలయంలో ఆదివారం ఎల్లమ్మదేవి కల్యాణం గొల్ల కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఘనంగా మదర్స్‌డే

రామచంద్రాపురం టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : మదర్స్ డే సందర్భంగా రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాసనగర్ ఈశ్వరీయ బ్రహ్మకుమారీల మందిరంలో ఆదివారం కేక్ కట్‌చేసి మహిళలకు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పానగేష్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మహిళలు ఒత్తిళ్లు తట్టుకుంటున్నారని వివరించారు. పిల్లలను ఆదరిస్తూ భర్తకు చేదోడువాదోడుగా ఉంటున్నారని వివరించారు.

సికింద్లాపూర్‌లో సుదర్శన హోమం

శివ్వంపేట, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామి వారి జన్మ నక్షత్రం సందర్భంగా ఆదివారం ఈవో శశిధర్‌గుప్తా ఆధ్వర్యంలో సముద్రాల నర్సింహచార్యులు సమక్షంలో సుదర్శన హోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి ధనుంజయశర్మ, జూనియర్ అసిస్టెంట్ నరసింహారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

బాణాపూర్‌లో సప్తాహ ప్రారంభం

నారాయణఖేడ్, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బాణాపూర్‌లోని రుక్మిణీ పాండురంగ ఆలయంలో ఆదివారం 22వ అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. మొదటి రోజు నందుమహరాజ్ కీర్తనలు నిర్వహించి ఆధ్యాత్మిక ప్రవచనాలిచ్చారు.

'బుద్ధ పౌర్ణమిని ఘనంగా నిర్వహించాలి'

నారాయణఖేడ్, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సోమవారం బుద్ధ పౌర్ణమిని ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్పీ ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు అనుముల తుకారం ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. అంబేడ్కర్ భవనాల్లో వేడుకలను ఏర్పాటు చేసి బుద్ధుడి బోధనలపై చర్చలు, బుద్ధుడి శాంతి సందేశాన్ని వ్యాప్తి చేయాలన్నారు.

బుద్ధుడి విగ్రహ ప్రతిష్ఠాపన

జహీరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూచనెల్లి గ్రామంలో సోమవారం గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానికులు, అభిమానులు తదితరులు హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఖేడ్ పీఏసీఎస్ డైరెక్టర్ మృతి

● అంత్యక్రియల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి


శంకరయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఖేడ్ మండల పరిధిలోని అనంత్‌సాగర్‌కు చెందిన బక్క శంకరయ్య(70) ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి గ్రామానికి వెళ్లి శంకరయ్య పార్థీవ దేహంపై పూలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబీకులను ఓదార్చారు. కాగా కల్హేర్ మండలం కృష్ణాపూర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఖయ్యూం ఆకస్మికంగా మృతిచెందగా, ఆయన అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన వెంట నాయకులు పండరిరెడ్డి, లోకేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అరుణ్‌రాజ్‌కు బీబీపాటిల్ పరామర్శ


అరుణ్‌రాజ్ శేరికార్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ బీబీపాటిల్

నారాయణఖేడ్, మే 11(ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండలం ఉజలంపాడ్‌కు చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరుణ్‌రాజ్ శేరికార్‌పై ఇటీవల కొందరు దాడికి పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీపాటిల్ ఆదివారం ఖేడ్‌లోని అరుణ్‌రాజ్ నివాసంలో పరామర్శించారు. దాడికి గల కారణాలను తెలుసుకున్నారు. ఆయన వెంట బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, పార్టీ నాగల్‌గిద్ద మండల అధ్యక్షుడు రాజశేఖర్‌పాటిల్, పట్నంమాణిక్, జ్ఞానేశ్వర్, తదితరులు ఉన్నారు.

నల్లపోచమ్మ జాతరలో రాజిరెడ్డి


నల్లపోచమ్మ జాతరలో రాజిరెడ్డి

శివ్వంపేట్, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నానుతండాలో నాను, సీత్యాబిక్యా, మూడు తండాలకు చెందిన గిరిజనులు రెండు రోజుల పాటు నిర్వహించిన నల్లపోచమ్మ జాతర ఆదివారం ముగిసింది. ఇందులో పీసీసీ కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నవీన్‌గుప్తా, కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి రాథోడ్, సూర్యంచౌహన్, ఇతర ప్రాంతాలకు చెందిన గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తూప్రాన్‌లో కూర్మ నృసింహస్వామి జయంతి


కూర్మ నృసింహ కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

తూప్రాన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణ శివారులోని పురాతన స్వయంభూ శ్రీ కూర్మ (కప్పెర) నృసింహస్వామి జయంతిని ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా సుదర్శనహోమం, స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఇందులో ఆలయ కమిటీ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ, కమిటీ సభ్యులు విద్యాసాగర్, డాక్టర్ ప్రదీప్‌సింహ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి ఉత్సవాలు


ఉత్సవాల్లో కాటా శ్రీనివాస్‌గౌడ్

రామచంద్రాపురం టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ పురపాలక పరిధి ఘన్‌పూర్ గ్రామంలో ఆదివారం భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం మహిళలు స్వామికి బోనాలు సమర్పించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ స్వామివారిని దర్శించుకున్నారు.

విద్యార్థుల బాగుకోసం ఉపాధ్యాయులు కృషి


ఆత్మీయ సమ్మేళనంలో గురువులు, విద్యార్థులు

నిజాంపేట, మే 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల బాగుకోసమే ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తారని రిటైర్డ్ ఉపాధ్యాయులు ఆంజనేయచారి, జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం 1999-2000లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం గురువులను సన్మానించారు.